జాతీయ దిన పత్రిక
# తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..
https://tholivelugu.com/
హైదరాబాద్ సంపుటి:01 సంచిక: 46 26-2-2026 వెల: రూ.2/- పేజీలు: 06




## పారిశ్రామికాభివృద్ధికి 'క్లస్టర్' వ్యూహం.

- ఉద్యోగాల కల్పనపై మంత్రి లోకేష్ కీలక ప్రకటన
- క్లస్టర్ల విధానంలో పారిశ్రామికాభివృద్ధికి ప్రభుత్వ ప్రణాళిక
- రాష్ట్రవ్యాప్తంగా 22 పారిశ్రామిక క్లస్టర్ల గుర్తించామన్న మంత్రి లోకేశ్
- ప్రపంచస్థాయి నైపుణ్య శిక్షణ, ఉద్యోగావకాశాలకు 'నైపుణ్యం' పోర్టల్
- పరిశ్రమల భాగస్వామ్యంతో స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాల బలోపేతం


2లో

## తెలుగు రాష్ట్రాల మధ్య తొలి గ్రీన్‌ఫీల్డ్ హైవే.. మేలో ప్రారంభం!


- ఖమ్మం-దేవరపల్లి మధ్య సిద్ధమైన తొలి గ్రీన్‌ఫీల్డ్ హైవే
- మే నెలలో ఈ రహదారిని ప్రారంభించేందుకు ఎన్‌హెచ్ఏఐ ఏర్పాట్లు
- హైదరాబాద్-విశాఖ మధ్య 56 కిలోమీటర్ల ప్రయాణ దూరం ఆదా
- నిబంధనలు ఉల్లంఘిస్తే ఆటోమేటిక్‌గా చలాన్లు జారీ చేసే వ్యవస్థ
- ప్రయాణించిన దూరానికే టోల్ వసూలు చేసే సరికొత్త విధానం

2లో

## స్టిక్కర్లపై ఉన్న శ్రద్ధ సమస్యల పరిష్కారంలో లేదని విమర్శ

- 'డయేరియా' మరణాలపై ధర్మాన ప్రసాదరావు ఫైర్
- కూటమి పాలనలో ప్రజారోగ్యం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందన్న ధర్మాన
- ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత మొదలైందని వ్యాఖ్య





## మ్యాన్యుఫాక్చరింగ్ పవర్‌గా తెలంగాణ


- ఉద్యోగాలపై ఏఐ, నైపుణ్యాభివృద్ధి, కొత్త అవకాశాలపై చర్చ
- ప్రభుత్వపరంగా ఏం చేయాలనే అంశాలపై వారి మధ్య చర్చ
- రాష్ట్రాన్ని తయారీ కేంద్రంగా నిలబెట్టడానికి చర్యలు తీసుకోవాల్సి ఉందన్న సీఎం

హైదరాబాద్: రాష్ట్రాన్ని మ్యాన్యుఫాక్చరింగ్ పవర్‌గా తీర్చిదిద్దాలని, ఇందుకు కొన్ని ముఖ్యమైన సంస్థలను ఆకర్షించేలా ప్రణాళికలు రూపొందిచాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అన్నారు. అడోబ్ సీఈఓ, తెలంగాణ రైజింగ్2047 విజన్ బోర్డు సభ్యులు శంతను నారాయణ్ బుధవారం సీఎం రేవంత్‌ను జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. దఆర్థిక వ్యవస్థపై ఏఐ టెక్నాలజీ విప్లవ ప్రభావం, రాబోయే రోజుల్లో ఈ టెక్నాలజీని సమర్థవంతంగా వినియోగించుకునే అంశాలపై శంతను నారాయణ్‌తో సీఎం చర్చించారు. తెలంగాణను అభివృద్ధి పథంలో ముందుకు నడిపించేందుకు మరింత సహకరించాలని సీఎం కోరారు. గ్లోబల్ ట్రెండ్స్, అవకాశాలపై ప్రభుత్వ పరంగా చేపట్టాల్సిన

- మిగతా 2వ పేజీలో

# వెలిగొండ నుంచి జూలైనాటికి నీరిస్తాం

- మార్కాపురం జిల్లాతో దశాబ్దాల కల సాకారం.. రూ.50 కోట్లతో కలక్టరేట్ నిర్మిస్తామని వెల్లడి
- జిల్లా ఏర్పడ్డాక తొలిసారి వెళ్లిన ముఖ్యమంత్రికి అపూర్వ స్వాగతం
- గత పాలకులు ప్రాజెక్టు పూర్తి కాకుండానే జాతికి అంకితమిచ్చారని విమర్శ
- వెలిగొండపై వైసీపీ డ్రామాలను ఎండగట్టిన ముఖ్యమంత్రి చంద్రబాబు
- రూ.456 కోట్లతో వెలిగొండ ఫీడర్ కెనాల్ పనులకు సీఎం శంకుస్థాపన
- మార్కాపురం జిల్లా కళ, వెలిగొండ కళకళ బహిరంగ సభా వేదికలో సీఎం



ఈ ఏడాది జులై నాటికి వెలిగొండ తొలిదశ పూర్తిచేసి మార్కాపురం జిల్లాలోని ప్రతి ఎకరాకు సాగు నీరందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. గత పాలకుడిలా ప్రాజెక్టు పూర్తి కాకుండానే జాతికి అంకితమంటూ రిబ్బన్ కటింగ్లు చేసి దొంగ నాటకాలు ఆడటం తమకు చేతకాదని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. వెనుకబాటుకు గురైన మార్కాపురం ప్రాంతాన్ని కొత్త జిల్లాగా ఏర్పాటు చేస్తామన్న హామీని నిలబెట్టుకున్నామని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రతీ ఎకరాకూ నీరివ్వాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామని

- మిగతా 2వ పేజీలో

## తెలంగాణలో హత్యా రాజకీయాలు జరుగుతున్నాయి

- కుమ్మెర జాతర ఘటనపై కేటీఆర్ ఆగ్రహం
- 2చిన్నారి కుటుంబానికి న్యాయం చేయాలని కేటీఆర్ డిమాండ్
- సమాజం తలదించుకోవాల్సిన ఘటన జరిగిందన్న కేటీఆర్
- నిందితులను కాపాడే ప్రయత్నం సిగ్గుమాలిన చర్య అన్న కేటీఆర్




2లో

## ఉగ్రవాదం పెనుముప్పు!

- దానిపై పోరులో రాజీ లేదు: మోదీ
- భారత్, ఇజ్రాయెల్‌ది ఒకే వైఖరి
- ఆ దేశానికి దన్నుగా నిలుస్తాం
- గాజా శాంతి చర్చలకు మద్దతు
- ఇజ్రాయెల్ పార్లమెంటు కెనెసెట్‌లో ప్రధాని ప్రసంగం

## దేవాలయాలు మన సంస్కృతికి ప్రతీకలు: జగన్

- నందిపల్లి గ్రామంలోని ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న జగన్
- భక్తి మార్గం ద్వారా సమాజంలో శాంతి వెల్లివిరుస్తుందని వ్యాఖ్య
- ఆలయ కమిటీని అభినందించిన జగన్


2లో

## స్టిక్కర్లపై ఉన్న శ్రద్ధ సమస్యల పరిష్కారంలో లేదని విమర్శ

శ్రీకాకుళం జిల్లాలో ప్రబలిన డయేరియా బాధితులను పరామర్శించిన మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు, ప్రస్తుత కూటమి ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. గత 20 నెలల కూటమి పాలనలో ప్రజారోగ్యం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని, ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలు ప్రజలకు శాపంలా మారాయని మండిపడ్డారు.

అతిసార వ్యాధితో జిల్లాలో నలుగురు ప్రాణాలు కోల్పోతే, ప్రభుత్వం మాత్రం కేవలం ఒకరు లేదా ఇద్దరే చనిపోయారని అబద్ధపు లెక్కలు చెబుతోందని ధర్మాన ఆరోపించారు. "వాంతులు, విరోచనాలతో ప్రజలు అల్లాడుతుంటే, సహాయం చేయాల్సింది పోయి పోస్టుమార్టం నివేదికలంటూ కాలయాపన చేస్తున్నారు. గత డిసెంబర్‌లోనూ బలగ ప్రాంతంలో ఇలాగే డయేరియా విజృంభించినా ప్రభుత్వం పాఠాలు నేర్చుకోలేదు. ప్రస్తుతం 100 మందికి పైగా రోగులు ఆసుపత్రుల పాలయ్యారు. మంచి ప్రభుత్వం అని స్టిక్కర్లు వేసుకోవడంపై ఉన్న శ్రద్ధ, ప్రజా సమస్యలను పరిష్కరించడంలో లేదు" అని ధ్వజమెత్తారు. ప్రతి జిల్లాకు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు అందించాలనే గత ప్రభుత్వ లక్ష్యాన్ని ప్రైవేటీకరణ పేరుతో తుంగలో తొక్కారని ధర్మాన విమర్శించారు. రాజధాని పేరుతో డబ్బునంతా ఒకే చోట కుమ్మరిస్తూ, జిల్లాల అభివృద్ధిని గాలికి వదిలేశారని ధ్వజమెత్తారు. సాగుకు యూరియా అందక రైతులు, ఇంగ్లీషు మీడియం చదువులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యానికి మద్దతు ధర లేకపోగా, క్వింటాల్‌కు రెండు కిలోల చొప్పున అదనంగా దోచుకుంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. శ్రీకాకుళం అభివృద్ధి కోసం కనీసం వెయ్యి కోట్లు అయినా ఖర్చు చేశారా? అని ప్రశ్నించిన ఆయన... ప్రజల్లో ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత మొదలైందని హెచ్చరించారు. ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని ఆయన హెచ్చరించారు.

## దేవాలయాలు మన సంస్కృతికి ప్రతీకలు: జగన్

కడప జిల్లా వేంపల్లె మండలం నందిపల్లి గ్రామంలోని నందీశ్వర ఆలయంలో నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో వైసీపీ అధినేత జగన్ పాల్గొన్నారు. శివ నామస్మరణతో మారుమోగుతున్న ఆలయ ప్రాంగణంలో జగన్ సంప్రదాయ దుస్తులు ధరించి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య జరిగిన హోమాలు, ప్రత్యేక అభిషేకాల్లో ఆయన భక్తిశ్రద్ధలతో పాలుపంచుకున్నారు. అనంతరం అర్చకులు ఆయనకు తీర్థప్రసాదాలు అందజేసి, వేదాశీర్వచనం గావించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ... దేవాలయాలు మన భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని అన్నారు. "భక్తి మార్గం ద్వారానే సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం వెల్లివిరుస్తాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఆలయాల పునర్నిర్మాణం జరగడం వల్ల ఆధ్యాత్మిక చైతన్యం మరింత విస్తరిస్తుంది" అని ఆయన పేర్కొన్నారు. నందిపల్లిలో ఈ మహోత్సవాన్ని ఒక పండగలా నిర్వహించడం గ్రామ ప్రజల ఐక్యతకు నిదర్శనమని ఆయన ప్రశంసించారు.

## తెలుగు రాష్ట్రాల మధ్య తొలి గ్రీన్‌ఫీల్డ్ హైవే.. మేలో ప్రారంభం!

తెలుగు రాష్ట్రాల మధ్య రహదారి రవాణా వ్యవస్థలో సరికొత్త శకం ప్రారంభం కానుంది. ఖమ్మం నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని దేవరపల్లి వరకు నిర్మించిన తొలి యాక్సెస్ కంట్రోల్ గ్రీన్‌ఫీల్డ్ హైవేని మే నెలలో ప్రారంభించేందుకు జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) ముమ్మర ఏర్పాట్లు చేస్తోంది. ఈ నాలుగు వరుసల రహదారి అందుబాటులోకి వస్తే ప్రయాణ సమయం గణనీయంగా తగ్గనుంది. హైదరాబాద్ నుంచి విశాఖపట్నం వెళ్లే వారికి ఈ రహదారి ఎంతో ప్రయోజనకరంగా మారనుంది. ప్రస్తుతం సూర్యాపేట, విజయవాడ మీదుగా 676 కిలోమీటర్లు ప్రయాణించాల్సి ఉండగా, ఈ కొత్త మార్గం ద్వారా 56 కిలోమీటర్ల దూరం తగ్గుతుంది. మొత్తం 162 కిలోమీటర్ల పొడవున రూ.4,451.87 కోట్ల వ్యయంతో ఈ రహదారిని అత్యాధునిక ప్రమాణాలతో నిర్మించారు. 95 శాతం పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. ఈ హైవే అనేక ప్రత్యేకతలను కలిగి ఉంది. అడ్వాన్స్‌డ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఏటీఎంఎస్) ద్వారా ప్రతి 2 కిలోమీటర్లకు ఒక 360-డిగ్రీల సీసీ కెమెరాను ఏర్పాటు చేశారు. అతివేగం, సీటు బెల్టు పెట్టుకోకపోవడం, రాంగ్ రూట్‌లో ప్రయాణించడం వంటి ఉల్లంఘనలను ఈ కెమెరాలు గుర్తించి ఆటోమేటిక్‌గా చలాన్లు జారీ చేస్తాయి. రహదారిపైకి ఎక్కడి నుంచి ఎక్కడి వరకు ప్రయాణించారో, ఆ దూరానికే టోల్ వసూలు చేస్తారు. ఇందుకోసం కేవలం 9 చోట్ల మాత్రమే ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లను ఏర్పాటు చేశారు.


## మ్యాన్యుఫాక్చరింగ్ పవర్‌గా తెలంగాణ

చర్యలను సీఎంకు శంతను నారాయణ్ వివరించారు. గ్లోబల్ మ్యాన్యుఫాక్చరింగ్, గ్రీన్ ఎనర్జీ, ఉద్యోగాలపై ఏఐ ప్రభావం, స్కిల్లింగ్ అండ్ రిస్కిల్లింగ్‌కు సంబంధించిన అంశాలను తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసంలో గత మూడు రోజులుగా యాగం జరిగినట్టు తెలుస్తోంది. కుటుంబసభ్యులతో కలిసి హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో నిర్వహించిన చండీయాగం బుధవారం ముగిసినట్టు సమాచారం. అయితే, ఈ యాగం నిర్వహణ గురించి అధికారికంగా ఎలాంటి సమాచారం బయటకు రాలేదు. గతంలో టీపీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సమయం నుంచే రేవంత్‌రెడ్డి యాగాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని, ఇందులో ప్రత్యేకత ఏమీ లేదని సీఎం సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి.

## తెలంగాణలో హత్యా రాజకీయాలు జరుగుతున్నాయి

తెలంగాణలో హత్యా రాజకీయాలు జరుగుతున్నాయని, సమాజం తలదించుకోవాల్సిన ఘటన కుమ్మెర జాతరలో జరిగిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. కుమ్మెర జాతరలో మృతి చెందిన చిన్నారి కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ కుమ్మెర గ్రామస్థులు ఈరోజు ధర్నా చేపట్టారు. ఈ ధర్నాకు మద్దతు తెలిపిన కేటీఆర్ మాట్లాడుతూ, ఈనాటికీ కులం పేరు మీద దాడులు దారుణమని అన్నారు. రెండేళ్ల చిన్నారికి కులం తెలుసా, మతం తెలుసా, పసిగుడ్డు ఏం అడిగిందని పొట్టన పెట్టుకున్నారని మండిపడ్డారు. ఈ ఘటనకు కారణమైన 8 మందిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. చిన్నారి ప్రాణాలు తీసిన వారికి ఎవరూ అండగా నిలవవద్దని అన్నారు. నిందితులను కాపాడేయత్నం సిగ్గుమాలిన చర్య అన్నారు.

# వెలిగొండ నుంచి జులైనాటికి నీరిస్తాం



వెల్లడించారు. దీనికోసం విశ్రాంత ఇంజనీర్లతో ఓ బృందాన్ని వేసి అధ్యయనం చేయిస్తామని తెలిపారు. ప్రతీ ఎకరాకూ సాగునీరు ఇచ్చే అంశంపై బ్లూ ప్రింట్ తయారు చేస్తామని అన్నారు. మార్కాపురం జిల్లా దోర్నాల మండలం గంటవాని పల్లెలో రూ.456 కోట్లతో వెలుగొండ ప్రాజెక్టు ఫీడర్ కెనాల్ పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేశారు. రైతులతో కలిసి పనులను పరిశీలించారు.

అనంతరం మార్కాపురంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి ప్రసంగిస్తూ, "గత ఐదేళ్లలో రాష్ట్రంలో విధ్వంసం జరిగింది. రాష్ట్ర పునర్నిర్మాణం కోసం టీడీపీ, బీజేపీ, జనసేన కూటమికి ప్రజలు 94 శాతం స్ట్రైక్ రేటు ఇచ్చారు. అరకు మొదలుకొని ప్రకాశం వరకూ మంచి విజయం అందించారు. మొన్నటి సార్వత్రిక ఎన్నికల్లో మార్కాపురం, మదనపల్లి, పోలవరం ప్రాంతాలను జిల్లాలు చేస్తానని మాట ఇచ్చి ఇప్పుడు నిలబెట్టుకున్నాను. ఇక్కడి ప్రజలు 150 కిలోమీటర్లు ప్రయాణించి ఒంగోలు కు వెళ్లాల్సిన పని లేకుండా మార్కాపురాన్ని జిల్లా చేశాను. అన్యాయం జరిగిన మదనపల్లికి న్యాయం చేశా" అని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. "1996, మార్చి 5న ఈ ప్రాంతంలో నేను పర్యటించినప్పుడు ప్రజల కష్టాలు కళ్లారా చూశాను. శ్రీశైలం నుంచి నీరివ్వమని ఇక్కడి ప్రజలు నన్ను కోరారు. ఆనాడు వెలుగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించాం. భగవంతుడు మళ్లీ నాకే అవకాశం ఇచ్చాడు. వెలిగొండను పూర్తి చేసి మీ జీవితాల్లో వెలుగులు తెస్తాను. రైతులను ఆదుకుంటాం. 2014-2019లో ప్రాజెక్టు పనులు పరుగులు పెట్టించాం. ఈ ప్రాజెక్టు ద్వారా 4.35 లక్షల ఎకరాలకు సాగు నీరు అందించడమే లక్ష్యం. దీని వల్ల గిద్దలూరు, మార్కాపురం, ఎర్రగొండపాలెం, కనిగిరి నియోజకవర్గాలకే కాకుండా ఉదయగిరి, కడప జిల్లా బద్వేలుకు కూడా నీరు అందుతుంది. 2019లో మనమే అధికారంలోకి వచ్చి ఉంటే 2021లోనే ప్రాజెక్టు పూర్తి చేసి నీరిచ్చేవాళ్లం. 2019-2024 మధ్య చీకటి రోజులు వచ్చాయి. గత ముఖ్యమంత్రి వెలిగొండ పూర్తి కాకుండానే జాతికి అంకితమంటూ దొంగ నాటకాలు ఆడాడు. చీమకుర్తి, మార్కాపురం సభల్లో 2023లో పూర్తి చేస్తానని హామీ ఇచ్చాడు. ఉత్తుత్తి ప్రాజెక్టుకు రిబ్బన్ కటింగ్ చేశాడు. ఇలా చేయడం మోసం కాదా. నేను చేయగలిగిందే చెబుతున్నాను. వెలిగొండ ప్రాజెక్టు పూర్తికి రూ.9081 కోట్ల నిధులు కావాలి. ఇప్పటి వరకూ ప్రాజెక్టు నిర్మాణానికి రూ.5451 కోట్లు ఖర్చు చేశాం. భూసేకరణకు రూ.484 కోట్లు, పునరావాసానికి రూ.184 కోట్లు ఖర్చు చేశాం. రెండు దశల్లో ఈ ప్రాజెక్టు పూర్తి చేయాలని ప్రణాళిక చేశాం. ఇంకా రూ.2,540 కోట్లు ఖర్చు చేస్తే కానీ వెలిగొండ పనులు పూర్తి కావు. గడచిన 20 నెలల్లో రూ.540 కోట్లు ఖర్చు చేసి పనులు వేగంగా చేపట్టాం. రూ.456 కోట్లతో విలువైన ఫీడర్ కెనాల్ లైనింగ్ పనులకు శంకుస్థాపన చేశాను. గత పాలకులు ఐదేళ్లలో ఈ ప్రాజెక్టుకు కేవలం రూ.500 కోట్లు ఖర్చు చేసి పనులు అయిపోయాయని రైతులకు పంగ నామాలు పెట్టారు. మంచి చేసిన వారికి అండగా నిలిస్తేనే ప్రజల జీవితాలు మెరుగు అవుతాయి" అని ముఖ్యమంత్రి అన్నారు. "అన్ని వర్గాలకు న్యాయం చేయడమే ఎన్డీఏ ప్రభుత్వ లక్ష్యం. ఎక్కడ పేదలు ఉంటే అక్కడ నేను ఉంటాను. ఎన్నికల్లో చెప్పినట్టే సూపర్ సిక్స్ సూపర్ హిట్ చేశాం. పింఛన్ల కోసం ప్రతి ఏటా రూ.34 వేల కోట్లు వెచ్చిస్తున్నాం. ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అంత మందికి తల్లికి వందనం ఇస్తున్నాం. స్త్రీ శక్తి కింద ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తున్నాం. మగవారితో సమానంగా మహిళలకు అవకాశాలు రావాలని డ్వాక్రా సంఘాలు స్థాపించాను. ఈ ఏడాది లక్షమంది ఆడబిడ్డలను పారిశ్రామిక వేత్తలుగా తయారుచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. దీపం పథకం కింద మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నాం. అన్నదాత సుఖీభవ కింద రైతులకు మూడు విడతల్లో రూ. 20,000 ఇస్తున్నాం. 2027లో పుష్కరాలకు ముందే పోలవరం పూర్తిచేసి జాతికి అంకితం చేస్తాం.

## సుప్రీంకోర్టులో మల్లారెడ్డికి దక్కని ఊరట

సుప్రీంకోర్టులో తెలంగాణ మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత మల్లారెడ్డి, ఆయన కుమారుడు మహేందర్ రెడ్డి, అల్లుడు మర్రి రాజశేఖర్ రెడ్డిలకు చుక్కెదురైంది. జీడిమెట్ల భూ సర్వేకు సంబంధించి తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పులో జోక్యం చేసుకోవడానికి సుప్రీంకోర్టు అంగీకరించలేదు. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కుత్బుల్లాపూర్ మండలంలోని జీడిమెట్ల సర్వే నం. 82/1/ఈఈలో గల 0.33 గుంటల భూమికి హద్దులు నిర్ణయించాలని కోరుతూ శేరి శ్రీనివాస్ రెడ్డి అనే వ్యక్తి తొలుత హైకోర్టును ఆశ్రయించారు. తన భూమికి వెళ్లే దారిని మూసివేశారని, ఈ విషయంలో తహసీల్దార్ జారీ చేసిన లేఖను కూడా ఆయన తన పిటిషన్‌లో సవాల్ చేశారు. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు సింగిల్ జడ్జి, 45 రోజుల్లోగా సర్వే పూర్తి చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఈ తీర్పును మల్లారెడ్డి తదితరులు డివిజన్ బెంచ్‌లో సవాల్ చేయగా, సింగిల్ జడ్జి ఉత్తర్వులను ద్విసభ్య ధర్మాసనం సమర్థించింది. దీంతో వారు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై నిన్న జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ ఎన్.వి. అంజరియాలతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం విచారణ జరిపింది. సర్వే ప్రక్రియ ఇప్పటికే పూర్తయినందున, ఈ దశలో తాము జోక్యం చేసుకోలేమని స్పష్టం చేస్తూ పిటిషన్‌ను తోసిపుచ్చింది.

## తిరుమలలో కొనసాగుతున్న రద్దీ.. 25 కంపార్టుమెంట్లలో భక్తులు

కలియుగ వైకుంఠం తిరుమల క్షేత్రంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. ఏడుకొండల వాడిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుండి భక్తులు భారీగా తరలివస్తున్నారు. బుధవారం ఉదయానికి వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని 25 కంపార్టుమెంట్లలో భక్తులు వేచి ఉన్నారు. టోకెన్లు లేని భక్తులకు స్వామివారి దర్శనానికి 12 గంటల సమయం పడుతుందని టీటీడీ అధికారులు తెలిపారు. సర్వదర్శనం టోకెన్లు ఉన్నవారికి 3 నుంచి 5 గంటల సమయం పడుతుందని వెల్లడించారు. రూ. 300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు ఉన్న భక్తులకు 2 నుంచి 3 గంటల సమయం పడుతుందని తెలిపారు. నిన్న మొత్తం 74,902 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. మొత్తం 22,869 మంది భక్తులు తలనీలాలను సమర్పించారు. హుండీ ద్వారా రూ. 4.05 కోట్ల ఆదాయం వచ్చింది.

## పారిశ్రామికాభివృద్ధికి 'క్లస్టర్' వ్యూహం..

రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధిని వేగవంతం చేసి, యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగాలు కల్పించేందుకు తమ ప్రభుత్వం 'క్లస్టర్ బేస్డ్' విధానంతో ముందుకు వెళ్తోందని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. సూపర్-6 హామీల్లో భాగంగా ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు సృష్టించడమే లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. శాసనసభలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ, రాష్ట్రంలో పరిశ్రమల స్థాపన, నైపుణ్యాభివృద్ధి, ఉద్యోగ కల్పనపై ప్రభుత్వ ప్రణాళికను ఆయన వివరించారు. ఈ కొత్త విధానంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 22 పారిశ్రామిక క్లస్టర్లను గుర్తించినట్లు లోకేశ్ తెలిపారు. రాయలసీమలో ఆటోమోటివ్, కర్నూలులో పునరుత్పాదక ఇంధనం, కడప-చిత్తూరుల్లో ఎలక్ట్రానిక్ మ్యానుఫ్యాక్చరింగ్, నెల్లూరులో గ్లాస్, ఉత్తరాంధ్రలో ఫార్మా, మెడికల్ డివైసెస్ వంటి క్లస్టర్లను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఒకే చోట ప్రధాన పరిశ్రమలతో పాటు వాటికి అవసరమైన అనుబంధ పరిశ్రమలు, విడిభాగాల తయారీ యూనిట్లను నెలకొల్పడం ద్వారా బలమైన పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థను (ఎకోసిస్టమ్) నిర్మించడమే తమ లక్ష్యమని వివరించారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు కలిగిన మానవ వనరులను అందించేందుకు స్కిల్ డెవలప్‌మెంట్‌పై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు మంత్రి తెలిపారు. రాష్ట్రంలో తయారయ్యే ప్రతి 100 ఏసీలలో 50 మన రాష్ట్రంలోనే ఉత్పత్తి అవుతున్నాయని, డైకిన్, ఎల్జీ వంటి కంపెనీలు తమకు అవసరమైన కోర్సులను ఐటీఐలలో ప్రవేశపెట్టాలని కోరాయని చెప్పారు. పరిశ్రమల భాగస్వామ్యంతో కోర్సుల కరిక్యులమ్ మార్చి, యువతకు నాణ్యమైన శిక్షణ అందిస్తామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏపీఎస్ఎస్‌డీసీ, సీడాప్, న్యాక్ ద్వారా 73,000 మందికి శిక్షణ ఇవ్వగా, వారిలో 40,000 మందికి ఉద్యోగాలు లభించాయని తెలిపారు. యువతకు నైపుణ్య శిక్షణ, ఉద్యోగావకాశాలు సులభంగా కల్పించేందుకు 'నైపుణ్యం' పేరుతో ఒక వినూత్న పోర్టల్‌ను త్వరలో ప్రారంభించనున్నట్లు లోకేశ్ వెల్లడించారు. ప్రపంచంలోనే తొలిసారిగా ఏఐ ఆధారిత టెక్నాలజీతో ఈ పోర్టల్ పనిచేస్తుందని, దీని ద్వారా యువత తమ నైపుణ్యాలను స్వయంగా అంచనా వేసుకోవచ్చని, రెస్యూమ్ తయారు చేసుకోవచ్చని, ఆన్‌లైన్ కోర్సులు నేర్చుకోవచ్చని వివరించారు. ఏఐ ట్యూటర్ ద్వారా ఇంటర్వ్యూలకు కూడా శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు.

## ఉగ్రవాదం పెనుముప్పు!

ఉగ్రవాదాన్ని అన్ని రూపాల్లోనూ సమూలంగా అంతం చేయడమే భారత్ లక్ష్యం. ఈ విషయంలో భారత్, ఇజ్రాయెల్‌ది ఒకే వైఖరి. ఎవరేమన్నా, ఎన్ని చెప్పినా ఉగ్రవాదం ఏవిధంగానూ సమర్థనీయం కాదు. ఈ విషయంలో మరో మాటకు తావు లేదు. ఇజ్రాయెలీలపై హమాస్ పాల్పడ్డ ఆటవిక దాడి తాలూకు బాధను భారతీయులందరమూ అనుభవించాం. ఇజ్రాయెలీ సోదరుల అంతులేని ఆవేదనను మేమంతా పంచుకున్నాం. ఎందుకంటే ఉగ్రవాదం తాలూకు నొప్పిని భారత్ చాలాకాలంగా అనుభవిస్తూ వస్తోంది. రక్షణ, వ్యవసాయ, వాణిజ్య తదితర రంగాల్లో ఇరుదేశాల భాగస్వామ్యం ముమ్ముందు మరింత బలోపేతం చేసుకుంటాం. అంతేగాక భారత్, ఇజ్రాయెల్, యూఏఈ, అమెరికాలతో కూడిన 'మిడిల్ ఈస్ట్ యూరప్ ఎకనామిక్ కారిడార్', 'ఐ2యూ2 ఫ్రేమ్‌వర్క్'ల్లో కూడా మరింత చురుగ్గా భాగస్వాములం అవుతాం. జెరూసలెం: ఉగ్రవాదం ఏ మూలన, ఏ రూపంలో ఉన్నా ప్రపంచమంతటికీ అది పెను ముప్పేనని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. "ఉగ్రవాదంపై పోరులో రాజీ పడే ప్రసక్తే లేదు. దాన్ని అన్ని రూపాల్లోనూ సమూలంగా అంతం చేయడమే భారత లక్ష్యం. ఈ విషయంలో భారత్, ఇజ్రాయెల్‌లది ఒకే వైఖరి" అని స్పష్టం చేశారు. ఇజ్రాయెల్ పర్యటనలో భాగంగా ఆయన బుధవారం ఆ దేశ పార్లమెంటు కెనెసెట్‌లో ప్రసంగించారు. కెనెసెట్ సభ్యులంతా గౌరవ సూచకంగా లేచి నిలబడి మరీ మోదీని స్వాగతించారు. 'మోదీ', 'మోదీ' అంటూ నినాదాలతో హోరెత్తించారు. అనంతరం ప్రధాని మాట్లాడుతూ, "ఉగ్రవాదం సమాజాలనే అస్థిరపరుస్తుంది. అభివృద్ధికి విఘాతంగా మారుతుంది. విశ్వాసాన్ని రూపుమాపుతుంది. అలాంటి ఉన్మాద భూతంపై పోరులో ద్వంద్వ ప్రమాణాలు పనికిరావు. దాన్ని రూపుమాపాలంటే ప్రపంచ స్థాయిలో పూర్తి సమన్వయంతో కూడిన ప్రయత్నాలు తప్పనిసరి" అని కుండబద్దలు కొట్టారు. పశ్చిమాసియాలో శాంతి సాధనకు ఉద్దేశించిన గాజా శాంతి చర్చలకు సంపూర్ణ మద్దతు పలికారు. చిరకాల మిత్ర దేశమైన ఇజ్రాయెల్‌కు భారత్ ఈ విషయంలో పూర్తిగా దన్నుగా నిలుస్తుందని ప్రకటించారు. గాజా శాంతి చర్చలు పశ్చిమాసియా అంతటా సుస్థిర, చిరకాల శాంతికి బాటలు పరుస్తాయని ఆయన ఆశాభావం వెలిబుచ్చారు. ఐరాస ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ ప్రయత్నాలు పాలస్తీనా సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తాయన్న నమ్మకం తనకుందన్నారు. "శాంతిమార్గం అంత సులువైనది కాదు. అయితే సదుద్దేశంతో కూడిన ప్రయత్నాలకు తెలివిడి, ధైర్యం, మానవత్వం తోడైతే విజయం సునిశ్చితం" అని పేర్కొన్నారు.

పశ్చిమాసియాలో శాంతి కోసం కొన్నేళ్ల క్రితం ఇజ్రాయెల్ 'అబ్రహం అకార్డ్స్'పై సంతకం చేసిన విషయాన్ని ఈ సందర్భంగా ప్రధాని గుర్తు చేశారు. "ఇజ్రాయెల్ చేపట్టిన ఆ చర్య దశాబ్దాల పాటు అట్టుడికిన పశ్చిమాసియాలో కొత్త ఆశలకు నాంది పలికింది. నాటినుంచి ఈ ప్రాంతంలో పరిస్థితులు అనూహ్యంగా మెరుగుపడ్డాయి" అంటూ హర్షం వెలిబుచ్చారు. ఇజ్రాయెల్ ధైర్యసాహసాలు, దశాబ్దాలుగా ఆ దేశం సాధిస్తున్న ఘన విజయాలంటే భారత్‌లో అందరికీ గొప్ప ఆరాధనా భావముందని చెప్పారు. ఇరుదేశాల నడుమ 2,000 ఏళ్లకు పైగా సన్నిహిత బంధాలున్నాయని గుర్తు చేశారు. 2023 అక్టోబర్ 7న హమాస్ ఉగ్ర సంస్థ జరిపిన పాశవిక దాడిలో భారీ సంఖ్యలో ఇజ్రాయెలీలు ప్రాణాలు కోల్పోవడం భారతీయులందరినీ కలచివేసిందని ప్రధాని అన్నారు. "వారి కుటుంబీకులకు తనతో పాటు భారతీయులందరి తరఫునా ఈ సందర్భంగా ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నా. ఎవరేమన్నా, ఎన్ని చెప్పినా ఉగ్రవాదం ఏ విధంగానూ సమర్థనీయం కాదు. ఈ విషయంలోమరో మాటకు తావు లేదు. ఇజ్రాయెలీలపై హమాస్ పాల్పడ్డ ఆటవిక దాడి తాలూకు బాధను భారతీయులందరమూ అనుభవించాం. ఇజ్రాయెలీ సోదరులు అంతులేని ఆవేదనను మేమంతా పంచుకున్నాం. ఎందుకంటే ఉగ్రవాద తాలూకు నొప్పిని భారత్ చాలాకాలంగా అనుభవిస్తూ వస్తోంది.

# మారుతిపై 'దాశరథి' వైభవం!

- హనుమంత వాహనంపై 'రామ' దర్శనం.. పులకించిన భక్తజనం
- వేద మంత్రాల మధ్య వైభవంగా తిరువీధి ఊరేగింపు
- బ్రహ్మోత్సవాల్లో అద్భుత ఘట్టం.. కోదండరాముడిగా యాద్రీశుడు
- కిటకిటలాడిన యాదగిరి క్షేత్రం: జై శ్రీరామ్ నినాదాలతో మారుమోగిన గుట్ట
- వేద మంత్రోచ్చారణల మధ్య వైభవంగా తిరుకైంకర్యాలు








**యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 25 (తొలివెలుగు):** యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామి అమ్మవార్లు హనుమంత వాహన సేవలో రామావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. లక్ష్మీ సమేత నరసింహుడు రామరూపంలో ఆలయ తిరువీధుల్లో విహరిస్తూ భక్తులను పరవశింపజేశారు. ఉదయం ఆలయ అర్చకులు, వేదపండితులు పంచసూక్తాలు, పంచోపనిషత్తుల మధ్య స్వామి అమ్మవార్లకు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం పట్టు వస్త్రాలు ధరింపజేసి వివిధ రకాల పుష్పమాలికలతో శోభాయమానంగా అలంకరించారు. భజా భజంత్రీలు, మంగళ వాయిద్యాల నాదాల మధ్య హనుమంత వాహనంపై స్వామి అమ్మవార్లను అధిష్ఠింపజేసి ఆలయ తిరుమాడ వీధుల్లో అంగరంగ వైభవంగా ఊరేగించారు. సేవ ప్రారంభానికి ముందు ఆలయ అర్చకులు హారతులు సమర్పించారు. అర్చకులు, అధికారులు, వేదపండితులు, ఋత్వికులు ముందుండగా భక్తులు "జై శ్రీరామ్, జై జై శ్రీరామ్" నినాదాలతో సేవను ముందుకు నడిపించారు. రామావతారంలో ఉన్న స్వామి దర్శనం కోసం పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. తిరువీధుల్లో ఊరేగిన అనంతరం స్వామి అమ్మవార్ల అలంకార సేవను కళ్యాణ మండపంలో నిర్వహించారు. స్వామివారికి ఎదురుగా వేదపండితులు పంచసూక్తాలు, పంచోపనిషత్తులు, సమస్త వేద పారాయణాలు పఠించారు. అనంతరం స్వామి అమ్మవార్లను తిరిగి ఆలయంలోనికి తీసుకెళ్లి నిత్య పూజా కైంకర్యాలను పూర్తి చేశారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ నరసింహమూర్తి, ఈవో భవానీ శంకర్, ప్రధాన అర్చకులు కాండూరి వెంకటాచార్యులు, డీఈఓ దౌర్భాల భాస్కర శర్మ, సురేంద్రాచార్యులు, శ్రీధర్ ఆచార్యులు, శ్రీనాథాచార్యులు, కిరణ్ కుమార్ ఆచార్యులు, అధికారులు నటరాజు, సీతారామాచార్యులు, నరేష్, వజ్జల లక్ష్మణాచార్యులు తదితరులు పాల్గొన్నారు.







## ప్రభుత్వ పాఠశాలకు మహర్దశ:

**- కుర్రారంలో వంటగది నిర్మాణానికి శ్రీకారం**

**రాజపేట, ఫిబ్రవరి 26 (తొలివెలుగు):** రాజపేట మండలం కుర్రారం గ్రామ ప్రాథమిక పాఠశాల ఆవరణలో వంటగది నిర్మాణ పనులు బుధవారం ప్రారంభమయ్యాయి. సర్పంచి బొడ్డు భాస్కర్ శుభారంభం చేశారు. విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణంలో మధ్యాహ్న భోజనం అందించాలనే ఉద్దేశంతో వంటగది నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి విద్యార్థుల వినియోగానికి అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ రావి కొండల్ రెడ్డి, వార్డు సభ్యులు ఎండి యూసుఫ్, ఎర్రగుంట ప్రభాకర్, వడ్లూరి కవిత, నంద పాండు, మేడి స్వరూప, రాపాక మానస పాల్గొన్నారు. అలాగే ప్రధానోపాధ్యాయుడు నరసింహులు, గ్రామ సెక్రెటరీ ఉమేష్, టెక్నికల్ అసిస్టెంట్ శ్రీనివాస్, హౌసింగ్ ఏఈ వివేకానంద, భూత్కూరి నరసింహారెడ్డి, కత్తుల అంజిరెడ్డి, పల్లపు వెంకట నరసయ్య, మేడి శ్రీనివాసులు, రొండ్ల స్వప్న, వల్లూరి దీవెన, జంగిటి మధులత, రేకులపల్లి అండాలు, రాగుల రాజు, వల్లూరి మమత తదితరులు హాజరయ్యారు. వంటగది నిర్మాణంతో విద్యార్థులకు మెరుగైన సదుపాయాలు కల్పించబడతాయని గ్రామస్థులు అభిప్రాయపడ్డారు.

## చిత్తాపురంగోపరాజుపల్లి రహదారి వెడల్పు చేపట్టాలి: సీపీఎం నేత గాజుల ఆంజనేయులు

**వలిగొండ, ఫిబ్రవరి 25 (తొలివెలుగు):** సీపీఎం సీనియర్ నాయకులు గాజుల ఆంజనేయులు చిత్తాపురం నుండి గోపరాజుపల్లి వరకు ఉన్న రహదారిని తక్షణమే వెడల్పు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలోని చిత్తాపురం గ్రామం నుండి గోపరాజుపల్లి వరకు గతంలో దాదాపు 33 ఫీట్ల నక్షా రహదారి ఉండేదని తెలిపారు. అయితే కాలక్రమేణా అది 12 నుండి 13 ఫీట్ల వరకే పరిమితమైందని పేర్కొన్నారు. దీంతో రవాణా రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రెవెన్యూ అధికారులు వెంటనే సర్వే చేపట్టి, రెండు వాహనాలు సులభంగా వెళ్లేలా రహదారిని విస్తరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అధికారులు స్పందించని పక్షంలో చిత్తాపురం, గోపరాజుపల్లి గ్రామాల ప్రజలను సమీకరించి, అన్ని రాజకీయ పార్టీలను కలుపుకుని పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు.

## యాద్రీశుని సన్నిధిలో ఖైరతాబాద్ ఎమ్మెల్యే

- దానం నాగేందర్‌కు నారసింహుడి చిత్రపటాన్ని అందజేసిన ఈవో
- భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్న ఎమ్మెల్యే
- క్షేత్రస్థాయిలో ఘనస్వాగతం.. ప్రత్యేక పూజల నిర్వహణ



**యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 25 (తొలివెలుగు):** యాదగిరిగుట్టలోని ప్రసిద్ధి గాంచిన శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంను దానం నాగేందర్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా స్వామి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వేద పండితులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి, అర్చనలు, ప్రత్యేక హారతులు నిర్వహించారు. దేవస్థానం ప్రాంగణానికి చేరుకున్న ఎమ్మెల్యేకు ఆలయ అధికారులు పూర్ణకుంభంతో ఆహ్వానం పలికారు. అనంతరం స్వామివారి గర్భగుడిలోకి ప్రవేశించి భక్తిశ్రద్ధలతో దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, అనుచరులతో కలిసి ప్రత్యేక అర్చనలు నిర్వహించి రాష్ట్ర ప్రజల శ్రేయస్సు, సుభిక్షం కోరుతూ ప్రార్థనలు చేశారు. ఆశీర్వచన మండపంలో ఆలయ అర్చకులు వేదమంత్రాల నడుమ ఎమ్మెల్యేకు ఆశీర్వచనం చేశారు. ఆలయ ప్రధానార్చకులు కాండూరి వెంకటాచార్యులు స్వామి అమ్మవార్ల తీర్థప్రసాదాలు అందజేసి శాలువాతో సత్కరించారు. దేవస్థానం ఈవో భవానీ శంకర్ నారసింహుడి చిత్రపటాన్ని అందించి స్మారకంగా ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దానం నాగేందర్ మాట్లాడుతూ.. యాదగిరిగుట్ట క్షేత్రం రాష్ట్రంలోనే కాక దేశవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన పవిత్రక్షేత్రమని, స్వామివారి కృప రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలని కోరుకున్నారు. ఆలయ అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనలో ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు సురేంద్రాచార్యులు, శ్రీధర్ ఆచార్యులు, డిఇఓ దౌర్భాల భాస్కర శర్మ, గజ్వేల్ రఘు, నటరాజు, సీతారామచార్యులు తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే రాకతో ఆలయ ప్రాంగణం భక్తులతో సందడిగా మారింది.

## రాజాపేట.... సామూహిక పారాయణం చేస్తున్న జై శ్రీమన్నారాయణ భక్త బృందం.



**వార్షికోత్సవంలో ప్రత్యేకం.....**

**జై శ్రీమన్నారాయణ భక్త బృందం చే సామూహిక పారాయణశీ......**

**రాజాపేట ఫిబ్రవరి 25 (తొలివెలుగు) :** రాజపేట మండల కేంద్రానికి చెందిన జై శ్రీమన్నారాయణ భక్త బృందం సామూహిక సహస్ర పారాయణ కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రేణిగుంట రెవెన్యూ పరిధిలోని శ్రీగిరి సంకల్ప సిద్ధి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా ఏకరూప దుస్తులు ధరించి పారాయణం గావించారు. శ్రీ స్వామి వారి కళ్యాణ మహోత్సవం ఎదుర్కోలు పురస్కరించుకొని రెండు రోజులపాటు ఆలయ ముఖమండపంలో స్వామివారిని తలుస్తూ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. శ్రీ విష్ణు సహస్ర పారాయణం, లలిత సహస్ర పారాయణం, హనుమాన్ చాలీసా పారాయణం, నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నంగునూరు జగదాంబ, బిర్రు భాగ్యలక్ష్మి, పెంట రజిత, బోగలత, పుష్పలత, పరమేశ్వరి, నాళ్ల పద్మ, బెజుగం స్వప్న, రాపాక భాగ్యలక్ష్మి, ఉప్పల స్వప్న తదితరులు ఉన్నారు వీరిని ఆలయ ట్రస్టు సభ్యులు అభినందించారు అంతకుముందు శ్రీ స్వామివారిని దర్శించుకోగా ఆలయ అర్చకులు ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆధ్యాత్మిక సేవలు భక్తి భావం పెంపొందించేందుకు జై శ్రీమన్నారాయణ భక్త బృందం చేస్తున్న విశేష కృషి వెలకట్టలేనిదని ట్రస్టు సభ్యులు అర్చకులు కొనియాడారు.



## మృతు ని కుటుంబానికి బియ్యం అందజేత

**రాజాపేట ఫిబ్రవరి 25 ( తొలి వెలుగు):** మండలంలోని చల్లూరు గ్రామానికి చెందిన కోట బన్నీ ఇటీవల అకస్మాత్తుగా మరణించినందున వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ 4వ వార్డ్ మెంబర్ సొల్లేటి కవిత స్వామి 25సెర్ల బియ్యం బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు 7వ వార్డ్ మెంబర్ బడే.రాజు,మాజీ సర్పంచ్ బడే ఎల్లయ్య, డీలర్ బడే. నర్సయ్య, బడే ఆంజనేయులు, లక్ష్మయ్య, బాలయ్య,మైసయ్య,మదారి, నాగరాజు, శివ గ్యార రాములు,రమేష్ ఎర్ర స్వామి,పరశురాములు, శ్రీకాంత్,కోట బాలనర్సయ్య, మహేందర్, మల్లేశం,వల్లూరి యాదగిరి, పల్లెపాటి ప్రవీణ్ వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## రాజాపేట... బియ్యం అందజేస్తున్న దృశ్యం.

**బీర్ల ఐలయ్య సహకారంతో బియ్యం అందజేత**

**రాజాపేట ఫిబ్రవరి 25 (తొలి వెలుగు):** రాజాపేట మండలం రఘునాథపురం గ్రామంలో ఇటీవల మరణించిన వడ్లకొండ కొండయ్య కుటుంబాసభ్యులకు ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సహకారంతో బుధవారం 50 కిలోల బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో 12వ వార్డ్ సభ్యులు డొంకెన శైలజ భాస్కర్, చల్లూరి చిన్న పోశయ్య బల్ల మహేష్ కలకుంట్ల సంపత్ చల్లూరి భాను పుల్లంగాని రాజు ఉమేష్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నా రు





## 07, 08 రాజాపేట..... ఉచిత పశు వైద్య శిబిరం దృశ్య

**జాల లో ఉచిత పశు వైద్య శిబిరం విజయవంతం**




**రాజాపేట ఫిబ్రవరి 25 (తొలివెలుగు):** రాజాపేట మండలం జాల గ్రామంలో బుధవారం నల్గొండ పశుగణాభివృద్ధి,రాజాపేట పశుసంవర్ధక శాఖ ల సంయుక్త ఆధ్వర్యంలో పశు గర్భకోశ పరీక్ష మరియు చికిత్స శిబిరం జరిగింది. ఈ కార్యక్రమాన్ని సర్పంచ్ గంధమళ్ళ నవనీత నర్సిములు ఉప సర్పంచ్ కొల్లూరి లావణ్య లు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి డాక్టర్ ఎం. చంద్రారెడ్డి మాట్లాడుతూ రైతులందరూ ఈనిన తర్వాత పాడి పశువులకు తప్పకుండా మూడు నెలలకు కట్టించాలన్నారు. పోషణలో పిండి పదార్థాలు, మాంసకృతులు విటమిన్లు, స్థూల సూక్ష్మ పోషకాలు మినరల్స్ సమతుల్యంగా ఇస్తే పాడిపశువులు సరైన సమయంలో ఎద కొచ్చి మూడు నెలలు లోపు కట్టే అవకాశం ఉంటుందన్నారు. రైతు సోదరులందరూ వందరోజుల ఉపాధి హామీ పథకంలో భాగంగా ఆవుల,గేదెల పాకలు1 లక్ష రూపాయలు, గొర్రెల మేకల పాకలు 92 వేలు మరియు కోళ్లపాకలు 2 లక్షల రూపాయలతో ఏర్పాటు చేసుకోవాలని రైతు సోదరులకు సూచించారు. ఈ చికిత్స శిబిరంలో శారజీపేట పశువైద్యాధికారి డాక్టర్ సామ నవీన్ రెడ్డి, గోపాలమిత్ర సూపర్ వైజర్ గోపగాని భానుప్రసాద్ గోపాలమిత్రులు బర్మ రాంచందర్,మహేష్, సట్టు బాల కిషన్, శ్రీశైలం పశు వైద్య సిబ్బంది గోగులోతు అశోక్, తిప్పర్తి శ్రీకాంత్,అజయ్, తాజ మాజీ సర్పంచ్ గుంటి మధుసూదనరెడ్డి ఫార్మా కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## మల్లగూడెం ప్రాథమిక పాఠశాలలో సోపరిపాలన దినోత్సవం



**రాజాపేట ఫిబ్రవరి 25 (తొలి వెలుగు):** రాజాపేట మండలం మొల్లగూడెం ప్రాథమిక పాఠశాలలో బుధవారం స్వపరిపాలన దినోత్సవ వేడుకలు జరిగాయి. పాఠశాల ప్రధానోపాధ్యాయులు గుగులోతు శ్రీకాంత్ వివరాలు చెప్పారు. కలెక్టర్ గా ఆర్. వైష్ణవి, డీఈఓ గా ఎం. పవన్ తేజ, ఎంఈఓ గా వి. అక్షిత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలుగా ఎన్. నందిని ఉపాధ్యాయులుగా జి. హరీష్, బి . శ్రీచందన, జి. పావని లు చక్కగా వ్యవహరించినట్లు చెప్పారు. న్యాయ నిర్ణేతలుగా, కార్యక్రమ విజయవంతానికి పాఠశాల ఉపాధ్యాయులు చిక్క ఉదయ్ కుమార్ సహకరించినట్లు తెలిపారు. మల్ల గూడెం సర్పంచి జన్నపల్లి బాలరాజు రెడ్డి, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ రెడ్డి బోయిన పోచమ్మ రాజులు విద్యార్థులను అభినందించారు.

## మున్సిపల్ చైర్మన్ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మార్వో

**చౌటుప్పల్, ఫిబ్రవరి 26:** చౌటుప్పల్ మున్సిపల్ చైర్మన్ మోగుదాల పావని రమేష్ గౌడ్ మావయ్య మోగుదాల స్వామి గౌడ్ ఇటీవల అనారోగ్యంతో మరణించడంతో ఎమ్మార్వో వీరా భాయి చైర్మన్ కుటుంబాన్ని వారి స్వగృహంలో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా మోగుదాల స్వామి గౌడ్ మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ఎమ్మార్వో వీరా భాయి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కష్టకాలంలో కుటుంబానికి ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం ఉంటుందని భరోసా ఇచ్చారు. పరామర్శించిన వారిలో ఆర్ఐ సుధాకర్, రామిరెడ్డి, సర్వేయర్ మురళి, కాంగ్రెస్ పార్టీ నాయకులు చెవగోని వెంకటేష్ గౌడ్, బొంగు రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## కళ్యాణమాడిన శ్రీ వేంకటేశ్వర స్వామి....

**ఇలవైకుంఠంగా మారిన శ్రీగిరి సంకల్ప సిద్ధి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయం.....**

**జయ జయ ద్వానాలతో మార్మోగిన రేనికుంట పరిసరాలు......**

**కోరిన కోర్కెలు తీరుస్తున్న శ్రీ స్వామివారికి కోటి దండాలు అంటూ మొక్కులు...**





**రాజాపేట, ఫిబ్రవరి 25 (తొలి వెలుగు):** పెండ్లి కుమారుడైన శ్రీ వెంకటేశ్వర స్వామి వారు రేణిగుంట శ్రీగిరి సంకల్ప సిద్ధి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో వివాహ వేడుకలు జరుపుకున్నారు. ఆలయ ట్రస్ట్ సభ్యులు, దాతలు భక్తజన సందోహం మధ్య శ్రీ స్వామివారి జయ జయ ద్వానాల మధ్య శ్రీ మహాలక్ష్మి గోదా సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి తిరు కళ్యాణ మహోత్సవ కార్యక్రమం అద్భుతంగా జరిగింది. వైదిక కార్యక్రమం నిర్వాహకులు మంగళగిరి నవీన్ ఆచార్యులు ఇతర అర్చక బృందం శ్రీ స్వామివారి కల్యాణ తంతును అద్భుతంగా నిర్వహించారు. శ్రీ స్వామి అమ్మవార్ల కళ్యాణం కనులకు కట్టినట్టుగా మంత్రోచ్చరణలు జరగడంతో పాల్గొన్న భక్తజనుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఆలయ ట్రస్ట్ సభ్యులు వట్టం రాఘవేందర్ గుప్త , కూర బద్రీనాథ్ గుప్త, సూది రెడ్డి నాగిరెడ్డి, సమ్మెట శ్రీనివాసరావు, ఎల్లారెడ్డి కుటుంబ సభ్యులతో కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. పలువురు దంపతులు కళ్యాణం లో పాల్గొని తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. కళ్యాణ ముఖ్య ఘడియలు అయిన జన్య ఉపవితం, పాణిగ్రహణం, జీలకర్ర ప్రధానం, మాల ధారణ, మాంగల్య ధారణ, తలంబ్రాలు, వడి బియ్యం సమర్పణ ప్రాశస్త్యాలను అర్చకులు అద్భుతంగా వివరించారు. శ్రీ స్వామి వారి కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న భక్తజనులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. పాల్గొన్న భక్తజనులందరూ జన్మ ధన్యులని అన్నారు. పాల్గొన్న భక్తులకు ఆశీర్వచనము తీర్థప్రసాద వితరణ అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో ప్రత్యేక కళ్యాణ మండపం ఏర్పాటు జరిగింది. మంటపంతో పాటు పరిసరాలను విద్యుత్ దీపాలు పచ్చని తోరణాలు పూలమాలలతో అలంకరించారు. ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం ఉదయం సుప్రభాత సేవ ఆరాధన సేవా కాలం నివేదన తీర్థ ప్రసాద గోష్టి శాంతి పాఠం చతుస్థానార్చన, మూలమంత్ర మూర్తి మంత్ర హోమాలు, శ్రీ మహాలక్ష్మి ఇష్టి, నిత్య పూర్ణాహుతి బలిహరణ సాయంత్రం శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణ సామూహిక శ్రీ మహాలక్ష్మి కుంకుమార్చన మంగళ శాసనము తీర్థ ప్రసాద గోష్టి కార్యక్రమాలు జరిగాయి. కోరిన కోరికలు తీరుస్తూ ఆలయ దర్శనాన్ని చేసుకున్న భక్తులకు ఆపన్న హస్తం అందజేస్తున్న శ్రీగిరి సంకల్ప సిద్ధి శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి కోటి దండాలు అంటూ భక్తులు దర్శించుకున్నారు. ప్రజలందరినీ సుఖసంతోషాలతో ఆనందంగా ఉంచాలని ఆలయ ట్రస్టు సభ్యులు ఈ సందర్భంగా స్వామి అమ్మవార్లను వేడుకున్నారు. శ్రీ స్వామి వారు రాజపేట ప్రాంతంలో కొలువై తీరడం తమ అదృష్టమని మండల ప్రజలు తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ బ్రహ్మోత్సవాల్లో పాల్గొనే అదృష్టం కల్పించినందుకు ట్రస్ట్ సభ్యులకు కృతజ్ఞతలు చెప్పారు.



## రెవిన్యూ శాఖలో టైపిస్ట్ కం కంప్యూటర్ ఆపరేటర్ల విధులను కొనసాగించాలి

**వారిని యధావిధిగా కొనసాగించాలి**

**రాష్ట్ర గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షులు మందడి ఉపేందర్ రెడ్డి**

**భువనగిరి ఫిబ్రవరి 25 తొలి వెలుగు:** రెవెన్యూశాఖలో జిల్లా పరిపాలన అధికారి, మండల రాజస్వ అధికారి మరియు తహశీల్దార్ కార్యాలయాలలో విధులు నిర్వర్తిస్తున్న టైపిస్ట్ కం. కంప్యూటర్ ఆపరేటర్లు వారికీ యాదవిధిగా విధులు కొనసాగించాలని టైపిస్ట్ కం. కంప్యూటర్ ఆపరేటర్లు లకు "పే స్కేల్"ఇప్పించుటకై బుధవారం సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మెన్ మందడి ఉపేందర్ రెడ్డి కి, గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షులు సి. జగన్ మోహన్ ప్రసాద్ కు వినతి పత్రం అందజేశారు అనంతరం ఇట్టి విషయమై మందడి ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రం లోని వివిధ జిల్లాలలో పనిచేస్తున్న టైపిస్ట్ కం కంప్యూటర్ ఆపరేటర్స్ 632 సేవలు నిలిపి వేస్తూ జారి చేసిన మేమో ను తక్షణమే నిలిపివేసి (632) మందిని యాదవిధిగా కొనసాగిస్తూ,ప్రజావాణి పోర్టల్, రేషన్ కార్డుల జారి, కళ్యాణ లక్ష్మి పథకం,మరియు ప్రభుత్వము ప్రవేశ పెట్టె ఎ పథకం అయిన రెవెన్యూ లో టైపిస్టు కం కంప్యూటర్ ఆపరేటర్లు పాత్ర కీలకంగా ఉంది కాబట్టి వారికి శాశ్వత ఉద్యోగ భద్రతా (పే స్కేల్) కలిపించి న్యాయపరమైన సమస్యలను పరిష్కరించి, నిరుపేద కుటుంబాలకు చెందిన వారిని ఆదుకోవడం ద్వారా చిన్న చిన్న పిల్లలు ఉన్న కుటుంబాలు రోడ్డున పడకుండా చేసి, వృద్ధులైన వారి తల్లితండ్రుల బాగోగులను చూసుకునే విధముగా ఉపాధి కల్పించి నిరుపేద జీవితాలలో వెలుగు నింపలని ప్రభుత్వాన్ని కోరారు ఈ కార్యక్రమంలో గెజిటెడ్ అధికారులు సంఘం జిల్లా అధ్యక్షులు సి. జగన్ మోహన్ ప్రసాద్ టీఎన్జీవోఎస్ జిల్లా కోశాధికారి కంచనపల్లి శ్రీకాంత్, ట్రెసా నాయకులు ఆర్. గణేశ్ ప్రసాద్ టైపిస్ట్ కం కంప్యూటర్ ఆపరేటర్లు నాయకులు తదితరులు పాల్గొన్నారు.






## ఆహార ఫోర్టిఫికేషన్‌పై అవగాహన కార్యక్రమం విజయవంతం

**యాదాద్రి భువనగిరి, ఫిబ్రవరి 26:** యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఆహార పదార్థాల ఫోర్టిఫికేషన్‌పై అవగాహన మరియు ప్రోత్సాహ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మిల్లర్ల సంఘ ప్రతినిధులు, అంగన్‌వాడీ సంఘ అధ్యక్షులు, రిటైలర్ దుకాణదారులు తదితరులు పాల్గొన్నారు. వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి మనోహర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, ప్రజల్లో పోషకాహార లోపాలను తగ్గించేందుకు ఫోర్టిఫైడ్ బియ్యం మరియు ఇతర ఆహార పదార్థాల వినియోగం అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఐరన్, ఫోలిక్ యాసిడ్, విటమిన్ బీ12 వంటి ముఖ్య పోషకాలు కలిపిన బియ్యం వినియోగం ద్వారా అనీమియా వంటి సమస్యలను గణనీయంగా తగ్గించవచ్చని వివరించారు. జిల్లా సివిల్ సప్లైస్ అధికారి రోజా మాట్లాడుతూ, ప్రభుత్వ పథకాల ద్వారా సరఫరా అయ్యే ఫోర్టిఫైడ్ బియ్యం ప్రయోజనాలను వివరించారు. ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) మరియు సంక్షేమ హాస్టళ్ల ద్వారా ఫోర్టిఫైడ్ బియ్యం పంపిణీ జరుగుతోందని తెలిపారు. జిల్లా సంక్షేమ అధికారి నర్సింగ్ రావు మాట్లాడుతూ, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆశ్రమ పాఠశాలలు మరియు ఇతర సంక్షేమ వసతిగృహాల్లో ఫోర్టిఫైడ్ ఆహారం అందించడం ద్వారా బాలల ఆరోగ్యం మెరుగుపడుతుందని పేర్కొన్నారు. గెజిటెడ్ ఇన్‌స్పెక్టర్ అండ్ డిజిగ్నేటెడ్ ఆఫీసర్ స్వాతి, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ ఇన్‌చార్జ్ శివ శంకర్ రెడ్డి ఫోర్టిఫికేషన్ అమలు విధానం, నాణ్యత నియంత్రణ, చట్టపరమైన అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు. ఫోర్టిఫికేషన్ ట్రైనర్ డా. ఆంజనేయులు చాగంటి శాస్త్రీయ ప్రాముఖ్యత, పోషకాహార లోపాల నివారణలో దీని పాత్ర, మిల్లర్లు పాటించాల్సిన సాంకేతిక మార్గదర్శకాలపై వివరించారు. జిల్లా వ్యాప్తంగా ఫోర్టిఫికేషన్‌పై మరింత చైతన్యం పెంపొందించి, ప్రజలకు పోషకాహార భద్రతను అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని అధికారులు తెలిపారు.






## మహిళా మండల సమైక్య గ్రూప్ ల ముఖ్య సమావేశం

**గోదావరిఖని,(తొలివెలుగు):** రామగుండం మున్సిపల్ పరిధిలోని స్థానిక 43 వ డివిజన్ లో రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ ఆదేశాల మేరకు మున్సిపల్ మెప్మా సిబ్బంది మహిళ గ్రూప్ ల సమైక్య సమావేశానికి ముఖ్యఅతిథిగా కార్పొరేటర్ దొంత శ్రీనివాస్ హాజరైనారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి,ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ మహిళా సమైక్య గ్రూపులకు పెద్దపీట వేస్తూ మహిళలు ఆర్థికంగా నిలబడాలనే ఉద్దేశంతో లబ్ధిదారులకు రుణాలు ఇవ్వడం జరుగుతుంది. మహిళను గౌరవించే సంస్కృతి కాంగ్రెస్ పార్టీకే సాధ్యమని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మెప్మా సిబ్బంది సి ఓ శమంత ఆర్ పి విజయ వార్డ్ ఆఫీసర్ విజయ్ కుమార్ గ్రూప్ మహిళలు పాల్గొన్నారు.

## క్యాంపెయిన్‌లో భాగంగా ఆటో డ్రైవర్లకు కంటి పరీక్షలు.




**నర్వ, ఫిబ్రవరి 25,(తొలివెలుగు):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అర్తవ్ అ లైవ్ 2.0" కార్యక్రమంలో భాగంగా రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా సాగుతున్న ఈ క్యాంపెయిన్‌లో భాగంగా, నర్వ మండలంలోని నర్వ,లంకాల, కుమార్ లింగంపల్లి, పాతెర్ చెడు గ్రామాలకు చెందిన 25 మంది ఆటో డ్రైవర్లకు మరికల్ లోని తిరుమల ఫంక్షన్ హాల్ నందు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా నర్వ సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ (రా×) పబ్బతి రమేష్ మాట్లాడుతూ.. డ్రైవర్ల ఆరోగ్య పరిస్థితి, ముఖ్యంగా కంటి చూపు సరిగ్గా ఉండటం వల్ల రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని పేర్కొన్నారు. ప్రభుత్వం చేపట్టిన ఈ 'అరైవ్ అలైవ్ 2.శ' కార్యక్రమం ద్వారా డ్రైవర్లలో బాధ్యతను పెంచుతూ, వారి క్షేమం కోసం ఇటువంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రతి డ్రైవర్ ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ, సురక్షిత ప్రయాణానికి సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది మరియు వైద్య బృందం సభ్యులు పాల్గొన్నారు.

## వివాహ వేడుకల్లో దైద



**రామన్నపేట: ఫిబ్రవరి (తొలివెలుగు):** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలపరిధిలోని నీర్నేముల గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు నోముల మల్లేష్ వసంతల కుమార్తె వివాహ మహోత్సవ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి దైద రవీందర్ పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆవుల నరసింహ యాదవ్,ఉపసర్పంచ్ సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కిషోర్, ఆవుల శ్రీశైలం యాదవ్,మాజీ ఉప సర్పంచ్ చల్ల అనిత సత్య ప్రకాష్,నోముల శంకర్,నోముల కుమార్,నోముల కృష్ణ,నోముల రామలింగం తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారులకు చిరు సహాయం

**రామన్నపేట: (తొలివెలుగు):** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల పరిధిలోని వెల్లంకి గ్రామానికి చెందిన జినుక ప్రకాష్ ఎలక్ట్రీషియన్ పని చేసుకుంటూ జీవనం సాగించేవారు. తన భార్య సంగీత గత కొన్ని నెలలు నుండి క్యాన్సర్ జబ్బుతో బాధపడుతూ ఫిబ్రవరి 17వ తేదీన మృత్యువాతపడ్డారు. వారికి ఇద్దరు చిన్నపిల్లలు లోహిత్(10),మరొక 11 నెలల బాబు ఉన్నారు. వారి కుటుంబ ఆర్థిక పరిస్థితి దయనీయంగా ఉందని తెలిసి సమిష్టి సేవా ఫౌండేషన్ సభ్యులు అందరు కలిసి సంగీత కుటుంబానికి 50 కేజీల బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో వెల్లంకి సర్పంచ్ ఇడెం రాధాశ్రీనివాస్,మిర్యాల రాజు, మిర్యాల గణేష్,గుడెల్లి దామోదర్ తదితరులు పాల్గొన్నారు.



# రజక సంఘం కొవ్వొత్తుల ర్యాలీ.

## కుమ్మెర ఘటనపై దుండగులపై కఠిన చర్యల డిమాండ్.




**దౌల్తాబాద్(తొలివెలుగు):** నాగర్ కర్నూల్ జిల్లాలోని కుమ్మెర గ్రామంలో ఇటీవల నిర్వహించిన మల్లన్న జాతర సందర్భంగా చోటుచేసుకున్న ఉద్రిక్త ఘటనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం రాత్రి దౌల్తాబాద్ మండల పరిధిలోని దొమ్మాట గ్రామంలో రజక సంఘం ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. దేవాలయ దర్శనానికి వెళ్లిన రజక (బీసీ) కుటుంబంపై కొందరు నిర్వాహకులు దాడి చేయడంతో రెండు నెలల శిశువు మృతి చెందిన ఘటనపై సంఘం సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. చాకలి చంద్రకళ కుటుంబ సభ్యులను ఆలయంలోకి అనుమతించకపోవడంతో వాగ్వాదం జరిగి, అనంతరం దాడికి దిగారని ఆరోపించారు. దాడి సమయంలో చిన్నారిని కాలితో తన్నడంతో తీవ్ర అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పేర్కొన్నారు. ఈ ఘటనలో కొందరు స్థానిక నాయకుల అనుచరులు పాల్గొన్నారని బాధితులు ఆరోపించారు. అయితే ఆరోపణలపై సంబంధిత వ్యక్తుల నుంచి అధికారిక స్పందన రాలేదని తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వెళ్లినా స్వీకరించలేదని, బాధితులపైనే కేసులు నమోదు చేశారని వాపోయారు. 100కు ఫోన్ చేసినప్పటికీ పోలీసులు ఆలస్యంగా వచ్చారని ఆరోపించారు. ఈ ఘటనపై బీసీ హక్కుల పరిరక్షణ సమితి తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ చట్టం కింద కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. కార్యక్రమంలో దొమ్మాట పాలకవర్గ సభ్యులు, మానవత్వవాదులు పాల్గొన్నారు.

## ఎస్సీ, ఎస్టీ బీసీ మైనార్టీల ప్రజలపె జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండిస్తూన్నాం

**బహుజన సంఘర్షణ సమితి - బి ఎస్ ఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు గంధమల్ల యాదగిరి**



**మోటకొండూరు/(తొలివెలుగు):** తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ బీసీ మైనార్టీల ప్రజలపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండిస్తూన్నమని బహుజన సంఘర్షణ సమితి – బి ఎస్ ఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు గంధమల్ల యాదగిరి అన్నారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ గత కొన్ని నెలలుగా తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో దళితులు, గిరిజనులపై దాడులు, అవమానాలు, కులదూషణలు, భూసంబంధిత వివాదాల పేరుతో హింసాత్మక ఘటనలు పెరుగుతున్నాయి. ముఖ్యంగా సూర్యాపేట జిల్లాలో కార్ల రాజేష్ లాకప్ మరణం పై ఎటు తేలకముందే పక్కనే ఉన్న భువనగిరి యాదాద్రి జిల్లా మోటకొండూర్ మండలంలోని నాంచారిపేట గ్రామంలో ఒక దళితుడు న్యాయవాది అయినందుకు జీర్ణించుకోలేక గంధమల్ల కరుణాకర్ పై కుల అహంకారంతో అవమానించి వారి తల్లిదండ్రులతో కాళ్ళు మొక్కించుకున్న పరిస్థితి ,దాని తర్వాత నాగర్ కర్నూల్ జిల్లా కొమ్మర గ్రామంలో చాకలి కులస్తుల పసికందును పొట్టను పెట్టుకున్న అగ్రకుల అహంకారులు ఇలాంటి వెన్నో చోటుచేసుకున్న సంఘటనలు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కలిగిస్తున్నాయి. రోజురోజుకు పెరుగుతున్న ఈ దాడులు రాజ్యాంగ హామీలకు విరుద్ధంగా ఉండటమే కాకుండా సామాజిక సమానత్వానికి ముప్పుగా మారుతున్నాయి. భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన హక్కులు, రక్షణ కల్పిస్తుందని స్పష్టంగా పేర్కొంటున్నప్పటికీ, భూమి, గౌరవం, ఉపాధి, సామాజిక హక్కుల విషయంలో ఎస్సీ, ఎస్టీ వర్గాలపై అన్యాయం కొనసాగుతోంది. కులవివక్షతో కూడిన దాడులు, బెదిరింపులు, సామూహిక అవమానాలు పెరగడం దురదృష్టకరం. ఇది కేవలం వ్యక్తిగత ఘర్షణలుగా కాకుండా సామాజిక నిర్మాణంలో ఉన్న అసమానతల ప్రతిబింబంగా చూడాలాన్నారు. ప్రభుత్వం వెంటనే ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ కేసులను వేగవంతంగా నమోదు చేసి, ప్రత్యేక కోర్టుల ద్వారా త్వరితగతిన విచారణ జరపాలి. బాధితులకు తక్షణ ఆర్థిక సహాయం, రక్షణ కల్పించాలి,దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుని, రాజకీయ ప్రవేశం లేకుండా న్యాయం జరగేలా చూడాలనీ వారు డిమాండ్ చేశారు. ప్రతి జిల్లాలో శాంతి భద్రతలపై ప్రత్యేక సమీక్ష నిర్వహించాలి,గ్రామ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టి కులవివక్షను నిర్మూలించేందుకు చర్యలు తీసుకోవాలి. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి, పోలీసు శాఖ ఉన్నతాధికారుల దృష్టికి, మానవ హక్కుల కమిషన్ దృష్టికి, అలాగే రాష్ట్ర మరియు జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు గంధమల్ల యాదగిరి తెలిపారు. అవసరమైతే రాష్ట్రవ్యాప్తంగా ప్రజాసంఘాలతో కలిసి ఉద్యమ కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్రంలో సామాజిక న్యాయం కేవలం నినాదంగా కాకుండా అమలులో కనిపించాలి. ఎస్సీ, ఎస్టీ ప్రజల భద్రత, గౌరవం కాపాడటం ప్రభుత్వం మరియు పోలీసు వ్యవస్థల బాధ్యత" అని ఆయన స్పష్టం చేశారు. కాబట్టి పోలీసులు వెంటనే ఎస్సి, ఎస్టీ కేసు పైన వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు .

## బీటీ రోడ్డు నిర్మాణం పనులు ప్రారంభం

**రాజాపేట (తొలివెలుగు):** రాజాపేట మండలంలోని మల్ల గూడెం గ్రామానికి బీటీ రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. ఇటీవల వార్త దినపత్రికలో ప్రచురితమైన "వార్త"కు స్పందన వచ్చింది. ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు రోడ్డు నిర్మాణం జరగాలని కోరగా కాంట్రాక్టర్ తో పనులకు ప్రారంభించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా సర్పంచి జెన్న బాలరాజు రెడ్డి, ఉప సర్పంచ్ రెడ్డబోయిన కవిత రాజు, నీల కలకమ్మ, రాములు, గొడుగు బ్రహ్మయ్య, జహంగీర్, గొడుగు కల్పన, కనకయ్య, బోయిన నాగరాజు గ్రామస్తులు రోడ్డు పనులను పరిశీలించారు.





## గుడుంబా స్థావారాలపై ప్రత్యేక దాడులు

**:- అక్రమ గుడుంబా తయారీ నిర్మూలనకు పోలీసుల కట్టుదిట్టమైన చర్యలు**

**మంచిర్యాల(తొలివెలుగు):** రామగుండం పోలీస్ కమీషనరేట్ మంచిర్యాల జోన్ పరిధిలోని నీల్వాయి పోలీస్ స్టేషన్ ఎస్ఐ జగదీశ్వర్ రెడ్డి మరియు చెన్నూరు రూరల్ సీఐ కృష్ణ ఆధ్వర్యంలో ఎక్సైజ్ శాఖ సిబ్బంది మరియు పోలీస్ స్టేషన్ సిబ్బంది కలిపి సుమారు 40 మంది కలిసి బుయ్యారం గ్రామంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా 20 గుడుంబా తయారీ కేంద్రాలను గుర్తించి దాడులు నిర్వహించి సుమారు 5,000 లీటర్ల పులియబెట్టిన బెల్లం మిశ్రమం (గుడుంబా పానకం)ను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా సీఐ కృష్ణ గ్రామ ప్రజలతో మాట్లాడుతూ, అక్రమంగా గుడుంబా తయారీ మరియు విక్రయాలు చట్ట విరుద్ధమని తెలిపారు. అలాంటి కార్యకలాపాల్లో పాల్గొనవద్దని సూచించారు. గుడుంబా తయారీలో ఎవరైనా పాల్గొంటే చట్టపరమైన కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. చెన్నూరు రూరల్ సీఐ కృష్ణ,ఎస్ఐ జగదీశ్వర్ రెడ్డి, చెన్నూరు ఎక్సైజ్ సిఐ హరి, మంచిర్యాల డీటీఫ్ సీఐ సమ్మయ్య,చెన్నూరు ఎక్సైజ్ ఎస్సై రమణ,బెల్లంపల్లి ఎక్సైజ్ ఎస్సై శారద,సిబ్బంది పాల్గొన్నారు. ద

## మహిళల భద్రతే లక్ష్యంగా అందుబాటులో షీ టీమ్

**:- షీ టీమ్ ఆధ్వర్యంలో బ్రాహ్మణపల్లిలో అవగాహన సదస్సు**



**పెద్దపల్లి,ఫిబ్రవరి(తొలివెలుగు):** రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు,షీ టీమ్ ఇంచార్జ్ ఎస్ఐ లావణ్య ఆధ్వర్యంలో పెద్దపెల్లి మండలం బ్రాహ్మణపల్లి గ్రామంలో వార్డ్ మెంబర్లకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో షీ టీమ్ అవగాహన సదస్సు నిర్వహించారు. షీ టీమ్ సభ్యురాలు స్నేహలత మహిళల భద్రత,ఆన్‌లైన్ మోసాలు, యాంటీ డ్రగ్స్ మరియు సైబర్ క్రైమ్స్‌పై అవగాహన కల్పించారు. మహిళల రక్షణ కోసం బస్ స్టాండ్‌లు,ప్రధాన చౌరస్తాలు,కాలేజీల వద్ద షీ టీమ్ నిరంతరం అందుబాటులో ఉంటుందని తెలిపారు. వేధింపులకు గురైతే 6303923700 నంబర్‌కు భయపడకుండా ఫోన్ చేయాలని ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. ఆన్‌లైన్ మోసాలకు గురైతే 1930 హెల్ప్‌లైన్‌కు సమాచారం ఇవ్వాలని, అత్యవసర పరిస్థితుల్లో 100 నంబర్‌కు డయల్ చేయాలని సూచించారు. తల్లిదండ్రులు పిల్లలపై పర్యవేక్షణ కలిగి ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో షీ టీమ్ సభ్యులు మౌనిక,సురేష్,కాపులపల్లి పంచాయతీ కార్యదర్శి అంజత్ పాషా,బ్రాహ్మణపల్లి సర్పంచ్ రోజా రాణి,తురకల మద్దికుంట పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్ మరియు వార్డ్ మెంబర్లు పాల్గొన్నారు.

## మహిళా మండల సమైక్య గ్రూప్ ల ముఖ్య సమావేశం

**గోదావరిఖని,ఫిబ్రవరి(తొలివెలుగు):** రామగుండం మున్సిపల్ పరిధిలోని స్థానిక 43 వ డివిజన్ లో రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ ఆదేశాల మేరకు మున్సిపల్ మెప్మా సిబ్బంది మహిళ గ్రూప్ ల సమైక్య సమావేశానికి ముఖ్యఅతిథిగా కార్పొరేటర్ దొంత శ్రీనివాస్ హాజరైనారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి,ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ మహిళా సమైక్య గ్రూపులకు పెద్దపీట వేస్తూ మహిళలు ఆర్థికంగా నిలబడాలనే ఉద్దేశంతో లబ్ధిదారులకు రుణాలు ఇవ్వడం జరుగుతుంది. మహిళను గౌరవించే సంస్కృతి కాంగ్రెస్ పార్టీకే సాధ్యమని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మెప్మా సిబ్బంది సి ఓ శమంత ఆర్ పి విజయ వార్డ్ ఆఫీసర్ విజయ్ కుమార్ గ్రూప్ మహిళలు పాల్గొన్నారు.



జాతీయ దిన పత్రిక
తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..




# ఎంగేజ్‌మెంట్ అయిన విషయం దాచిపెట్టిన హీరో..

## డేటింగ్ పేరుతో నన్ను మోసం చేశాడన్న మమతా మోహన్ దాస్

టాలీవుడ్ ప్రేక్షకులకు యమదొంగ సినిమాతో సుపరిచితురాలైన మమతా మోహన్‌దాస్ దక్షిణాది సినీ పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. కేవలం హీరోయిన్‌గా మాత్రమే కాకుండా గాయనిగా కూడా తన ప్రతిభను చాటుకున్నారు. మలయాళ చిత్రసీమలో కెరీర్ ప్రారంభించిన ఆమె, తర్వాత తెలుగు--తమిళ భాషల్లోనూ వరుస అవకాశాలు అందిపుచ్చుకున్నారు. తెలుగులో యమదొంగతో పాటు కృష్ణార్జున, హోమం వంటి చిత్రాల్లో నటించి మంచి ఆదరణ పొందారు. స్వచ్ఛమైన నటన, అందమైన స్క్రీన్ ప్రెజెన్స్, మృదువైన గాత్రం ఈ మూడు కలయిక ఆమెకు ప్రత్యేకమైన క్రేజ్‌ను తీసుకొచ్చాయి.అయితే కెరీర్ సక్సెస్‌ఫుల్‌గా సాగుతున్న సమయంలోనే మమత వ్యక్తిగత జీవితంలో తీవ్రమైన సవాళ్లు ఎదురయ్యాయి. 2009లో ఆమెకు మొదటిసారి క్యాన్సర్ నిర్ధారణ కావడం సినీ వర్గాలను షాక్‌కు గురిచేసింది. దీర్ఘకాల చికిత్స అనంతరం కోలుకుని మళ్లీ సినిమాల్లోకి రీఎంట్రీ ఇచ్చారు. కానీ 2013లో మరోసారి అదే వ్యాధి తిరగబెట్టింది. అంతేకాదు, ఆమెకు విటిలిగో (బొల్లి) సమస్య కూడా తలెత్తింది. వరుస ఆరోగ్య సమస్యలు ఎదురైనా ఆమె ధైర్యం కోల్పోలేదు. తన అనుభవాలను పంచుకుంటూ క్యాన్సర్ సర్వైవర్‌గా అనేక మందికి ప్రేరణగా నిలిచారు. కొంత విరామం తర్వాత 2023లో విడుదలైన రుద్రాంగి సినిమాతో మరోసారి ప్రేక్షకుల ముందుకు వచ్చి తన రీ-ఎంట్రీని గుర్తుండిపోయేలా చేసుకున్నారు.ఇటీవల ప్రముఖ నటి సుహాసిని మణిరత్నం నిర్వహించిన ఓ పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న మమతా, తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన అనేక విషయాలను బహిరంగంగా పంచుకున్నారు. ముఖ్యంగా ప్రేమ, డేటింగ్ విషయాల్లో ఎదురైన చేదు అనుభవాలు అభిమానులను కదిలించాయి. క్యాన్సర్ నిర్ధారణ తర్వాత జీవితాన్ని మరింత సానుకూలంగా చూడాలని, సాధారణ మహిళలా తన భావోద్వేగాలను అనుభవించాలని భావించానని ఆమె తెలిపారు. మలయాళ పరిశ్రమకు చెందిన ఓ ప్రముఖ నటుడు తనను డేటింగ్‌కు ఆహ్వానించాడని, కుటుంబ సభ్యుల అనుమతితో ఆ పరిచయాన్ని కొనసాగించానని చెప్పారు. అయితే ఆ వ్యక్తికి అప్పటికే మరొకరితో నిశ్చితార్థం జరిగిన విషయం తర్వాత తెలిసిందని వెల్లడించారు. ఈ విషయం తనను తీవ్రంగా కలిచివేసిందని, నమ్మకద్రోహం మానసికంగా కుంగదీసిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం మరో వ్యక్తితో పరిచయం ఏర్పడినా, అతను ప్రేమకంటే తన కెరీర్ ముఖ్యమని చెప్పడంతో ఆ బంధం కూడా ముగిసిపోయిందని తెలిపారు.ఈ అనుభవాలన్నీ తనకు జీవిత పాఠాలు నేర్పాయని, ఇప్పుడు తాను మరింత బలంగా మారానని మమతా చెప్పారు. వ్యాధులతో పోరాడి గెలవడమే కాకుండా, వ్యక్తిగత జీవితంలోని ఎదురు దెబ్బలను కూడా ధైర్యంగా ఎదుర్కొన్న ఆమె ప్రయాణం అనేక మందికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది.

# బాలీవుడ్‌ను వణికిస్తున్న బెదిరింపులు.. నటి హిమాన్షీకి ప్రాణహాని రూ.10 కోట్ల డిమాండ్!



బాలీవుడ్ ప్రముఖ నటి, గాయకురాలు హిమాన్షీ ఖురానాకు గుర్తుతెలియని వ్యక్తుల నుంచి ప్రాణహాని తలపెడతామనే హెచ్చరికలు రావడం ఇండస్ట్రీలో కలకలం రేపుతోంది. ఇంతకుముందు కూడా ఇలాంటి బెదిరింపులు బాలీవుడ్ ప్రముఖులకు వచ్చాయి. జీషన్ అక్తర్ అనే పేరుతో పంపిన ఈమెయిల్‌లో పది కోట్ల రూపాయలు ఇవ్వాలని, లేనిపక్షంలో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ఒక వాయిస్ నోట్ ద్వారా నిందితుడు హిమాన్షీని బెదిరించాడు. దీంతో అప్రమత్తమైన హిమాన్షీ వెంటనే మొహాలీ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయగా, అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పంజాబీ చిత్రం 'సద్దా హక్'తో వెలుగులోకి వచ్చిన హిమాన్షీ, బిగ్‌బాస్ సీజన్ 13 ద్వారా దేశవ్యాప్తంగా గుర్తింపు పొందారు. కేవలం హిమాన్షీ మాత్రమే కాకుండా, ఇటీవల స్టార్ డైరెక్టర్ రోహిత్ శెట్టి, హీరో రణ్‌వీర్ సింగ్‌లకు కూడా ఇలాంటి చేదు అనుభవాలే ఎదురయ్యాయి. లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌కు చెందిన హ్యారీ బాక్సర్‌గా పరిచయం చేసుకున్న ఒక వ్యక్తి, వారిద్దరికీ వాట్సాప్ ద్వారా వాయిస్ మెసేజ్‌లు పంపుతూ బెదిరింపులకు పాల్పడ్డాడు. తన డిమాండ్‌లను నెరవేర్చకపోతే వారి వ్యక్తిగత సిబ్బందిని హతమారుస్తానని హెచ్చరించడం బాలీవుడ్ వర్గాల్లో ఆందోళనను పెంచుతోంది. వరుసగా సినీ ప్రముఖులే లక్ష్యంగా సాగుతున్న ఈ బెదిరింపుల వెనుక ఉన్న ముఠాలను పట్టుకునేందుకు పోలీసులు తమ విచారణను వేగవంతం చేశారు.

## రెడ్ కార్పెట్‌పై ఫోటోగ్రాఫర్‌కు వార్నింగ్ ఇచ్చిన ఆయేషా ఖాన్ ..



డ్యాన్సింగ్ క్వీన్‌గా పేరుగాంచిన ఆయేషా ఖాన్ ఓ ఫోటోగ్రాఫర్‌పై ఆగ్రహం వ్యక్తం చేసిన సంఘటన సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.ముంబైలో జరిగిన ౧ఐ ఫ్ మీుఱఅ స్పెషల్ స్క్రీనింగ్ సందర్భంగా ఈ ఘటన జరిగింది. స్క్రీనింగ్‌కు హాజరైన ఆయేషా రెడ్ కార్పెట్‌పై ఫోటోలకు పోజులు ఇస్తుండగా, కొందరు ఫోటోగ్రాఫర్లు ఆమెను వెనుక వైపు నుంచి వీడియో తీయడానికి ప్రయత్నించారు. ఇది గమనించిన ఆమె వెంటనే అసహనం వ్యక్తం చేస్తూ వారిని సున్నితంగా హెచ్చరించారు. "ఆప్ ఇజ్జత్ ఖుద్ కమాయేంగే, ఔర్ ఖుద్ హీ గవ్వాయేంగే... ప్లీజ్ మత్ కరియే, అచ్చా నహీ లగ్తా" అంటూ హిందీలో వ్యాఖ్యానించారు. అంటే "గౌరవాన్ని మీరే సంపాదించుకుంటారు... మీరే కోల్పోతారు... దయచేసి ఇలా చేయకండి, ఇది మంచిది కాదు" అనే అర్థం. ఆమె వ్యాఖ్యలు అక్కడున్న వారిని కాసేపు ఆలోచింపజేశాయి. సోషల్ మీడియా యుగంలో సెలబ్రిటీల వ్యక్తిగత గోప్యతను పట్టించుకోకుండా అసభ్యకర యాంగిల్స్‌లో ఫోటోలు తీయడం పెరిగిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదే విషయంపై ఇటీవల ఓ ఇంటర్వ్యూలో కూడా ఆయేషా స్పందిస్తూ "ఊప్స్ మూమెంట్స్ కోసం వెతకడం సరైంది కాదు" అని అభిప్రాయపడింది.



# 'స్వయంభూ' టీజర్‌పై చర్చ రగిలించిన నిఖిల్ పోస్ట్ ..

**ఎవరిని ఉద్దేశించి ఆ కామెంట్ చేశాడు**

టాలీవుడ్‌లో థ్రిల్లర్ సినిమాలతో తనకంటూ ప్రత్యేక మార్కెట్ సంపాదించుకున్న యంగ్ హీరో నిఖిల్ సిద్ధార్థ ప్రస్తుతం భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్ స్వయంభూ తో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన టీజర్ ఇటీవల విడుదలై మంచి స్పందన దక్కించుకుంది. విజువల్స్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, యాక్షన్ ఎలిమెంట్స్‌తో టీజర్ ఆకట్టుకోవడంతో సోషల్ మీడియాలో ట్రెండ్ అయింది. అయితే టీజర్‌కు వచ్చిన పాజిటివ్ రెస్పాన్స్‌తో పాటు మరో అంశం టాలీవుడ్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. టీజర్‌ను ౧ఐ= క్వాలిటీలో మళ్లీ అప్‌లోడ్ చేసిన సందర్భంగా నిఖిల్ చేసిన ఒక కామెంట్ చర్చకు దారితీసింది. యూట్యూబ్ గ్లిట్జ్‌ల వల్ల టీజర్‌ను మళ్లీ అప్‌లోడ్ చేశాం అని పేర్కొన్న ఆయన, చివర్లో "రీసెంట్‌గా వచ్చిన ఒక సినిమాలా మా చిత్రంలో ఎలాంటి ౼ూ× వినియోగించలేదు అని స్పష్టంగా చెప్పడం విశేషంగా మారింది. ఈ ఒక్క కామెంట్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అయింది. నిఖిల్ ఎవరిని ఉద్దేశించి ఈ వ్యాఖ్య చేశారనే దానిపై నెటిజన్లు చర్చలు మొదలుపెట్టారు. ఇటీవల విడుదలైన కొన్ని సినిమాల్లో విజువల్ ఎఫెక్ట్స్, డీప్‌ఫేక్ టెక్నాలజీ, AI టూల్స్ వినియోగంపై విమర్శలు వచ్చిన నేపథ్యంలో ఈ వ్యాఖ్యకు ప్రాధాన్యం పెరిగింది. దీంతో "నిఖిల్ ఏ సినిమాను టార్గెట్ చేశాడు?" అన్న ప్రశ్న సినీ వర్గాల్లో వినిపిస్తోంది. సినిమా ప్రమోషన్‌లో భాగంగా చేసిన కామెంట్ అయినా, ఇది ఇండస్ట్రీలో టెక్నాలజీ వినియోగంపై మరోసారి చర్చ మొదలయ్యేలా చేసింది. కొందరు నిఖిల్ పారదర్శకతను ప్రశంసిస్తుండగా, మరికొందరు ఇది అవసరం లేని పోలిక అని అభిప్రాయపడుతున్నారు. మొత్తానికి టీజర్ కంటే ఎక్కువగా నిఖిల్ చేసిన ఈ AI వ్యాఖ్యే ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.'స్వయంభూ' సినిమాపై ఇప్పటికే అంచనాలు పెరిగిన వేళ, ఈ వివాదం కూడా చిత్రానికి అదనపు ప్రచారం తీసుకువచ్చిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. దర్శకబృందం మాత్రం కంటెంట్ క్వాలిటీ, విజువల్ గ్రాండియర్‌పైనే దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. రిలీజ్ డేట్‌పై త్వరలో అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది.

# ఒక్క డైలాగ్ నచ్చి సినిమా తీశా!

'కోర్ట్' సినిమాతో హిట్ పెయిర్‌గా గుర్తింపు తెచ్చుకున్నారు హర్ష్ రోషన్, శ్రీదేవి. వీరిద్దరూ 'బ్యాండ్‌మేళం' చిత్రంతో మరోమారు వెండితెరపై సందడి చేసేందుకు సిద్ధమవుతున్నారు. సతీష్ జవ్వాజీ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని కోన వెంకట్ నిర్మించారు. మార్చి 13న విడుదలకానుంది. వాలెంటైన్స్ డే సందర్భంగా ఈ సినిమా గ్లింప్స్‌ను అగ్ర దర్శకుడు త్రివిక్రమ్ సోషల్‌మీడియా ద్వారా విడుదల చేశారు. 'తాళికట్టడం కలిసి ఉండటం కోసమే అయితే.. మధ్యలో విడిచిపెట్టిన దానికి కాదురా..చిన్నప్పటి నుంచి నాతోనే ఉన్న వీడికి కట్టాలిరా' అని స్టోరీ నరేషన్ సందర్భంగా దర్శకుడు చెప్పిన డైలాగ్ నచ్చి ఈ సినిమాకు శ్రీకారం చుట్టానని నిర్మాత కోన వెంకట్ తెలిపారు. తెలంగాణ నేపథ్యంలో హృద్యమైన ప్రేమకథ ఇదని, ప్రతీ సీన్‌లో ఎమోషన్స్ పండాయని దర్శకుడు పేర్కొన్నారు. హార్ట్ టచింగ్ లవ్‌స్టోరీగా అందరిని ఆకట్టుకుంటుందని నాయకానాయికలు తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: విజయ్ బుల్గానిన్, రచన-దర్శకత్వం: సతీష్ జవ్వాజి.

